ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి





వైసీపీలో వివేకా కలవరం

జిల్లాలో షర్మిల బస్సుయాత్రను జగన్ శిబిరం మొదట చాలా లైట్ తీసుకుంది. కాంగ్రెస్‌పార్టీ భూస్థాపితమైంది.. దాన్ని ఎవరూ లేపలేరు.. ఏదో షర్మిల పోటీ చేసినా ఎలాంటి ఉపయోగం ఉండదు. దాని వల్ల వైసీపీకి ఎలాంటి మైనస్ ఉండదని తొలుత మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించారు. షర్మిల, సునీతలను తక్కువ అంచనా వేశారు. అయితే ఐదు రోజుల బస్సుయాత్ర వైసీపీకి ముచ్చెమటలు పోయించడమే కాదు.. ఎక్కడ ఎన్నికల్లో తమ పుట్టి ముంచుతుందోనన్న భయం ఆ పార్టీలో మొదలైందని అంటున్నారు. వివేకాను హత్య చేయించింది అవినాశ్ అంటూ షర్మిల, సునీతలు బస్సు యాత్రలో పదేపదే చెప్పడం జగన్ శిబిరాన్ని కలవరపాటుకు గురిచేస్తోందని అంటున్నారు.

- హత్య చేయించింది అవినాశే అంటూ..
- పులివెందులలో ఏకిపారేసిన షర్మిల, సునీత
- వివేకా హత్యపై జనాల్లో జోరుగా చర్చ

(కడప-ఆంధ్రజ్యోతి): కాలం ఎవరినీ వదిలిపెట్టదంటారు. సరిగ్గా ఐదేళ్ల క్రితం 2019 సార్వత్రిక ఎన్నికల్లో వివేకా హత్య సంచలనం. టీడీపీ వారే హత్య చేయించారంటూ జగన్ శిబిరం తీవ్ర విమర్శలు గుప్పించింది. సీన్ కట్ చేస్తే.. ఐదేళ్లకు మళ్లీ వచ్చిన ఈ ఎన్నికల్లో వివేకా హత్య ప్రధానాస్త్రంగా మారడం వైసీపీని కలవరపాటుకు గురిచేస్తోంది. సీబీఐ విచారణతో వివేకా హత్య కేసులో ఇంటిగుట్టు రట్టయింది. ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిలను సీబీఐ నిందితులుగా చేర్చింది. అయినా సీఎం జగన్ ఆయన భార్య భారతి ఎంపీ అవినాశ్‌రెడ్డికి మద్దతు పలుకుతుండగా.. సీఎం సోదరి షర్మిల వివేకాను హత్య చేసిన వారిని శిక్షించాలంటూ పోరాడుతున్న సునీతకు బాసటగా నిలుస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి కడప ఎంపీగా పోటీ చేయనున్న వైఎస్ షర్మిల జిల్లాలో చేపట్టిన ఐదురోజుల బస్సుయాత్ర జగన్ శిబిరానికి చెమటలు పోయిస్తోంది. ముఖ్యంగా షర్మిల, సునీతల బాణంలాంటి మాటలకు అవినాశ్‌రెడ్డి శిబిరం ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

పీసీసీ చీఫ్‌గా వైఎస్ షర్మిల బాధ్యతలు చేపట్టాక వివేకా ఐదో వర్ధంతి సందర్భంగా కడపలో చేపట్టిన ఆత్మీయ సమావేశానికి వచ్చారు. అంతకు ముందు కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా విడుదలప్పుడు, పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టినప్పుడు ఇడుపులపాయకు వచ్చి దివంగత వైఎస్‌కు నివాళులర్పించారు. కడప నుంచి ఎంపీగా బరిలో దిగుతున్నానని ప్రకటించిన తరువాత న్యాయ్ యాత్ర పేరిట బస్సుయాత్ర చేపట్టారు.

అటాక్.. అటాక్..

గల్లీలో ఎవరైనా సిక్సర్ కొడతారు. గ్రౌండ్‌లో కొట్టేవాడే మగాడు అని ప్రభాస్ సినిమాలో డైలాగ్ ఉంది. అడపాదడపా ప్రెస్‌మీట్లలో చెప్పడం కాదు జిల్లాలో జరిగిన ఐదు రోజుల బస్సుయాత్రలో షర్మిల, సునీత జగన్‌పై అటాక్ చేశారు. "వైఎస్ వివేకాను హత్య చేయించింది వైఎస్ అవినాశ్‌రెడ్డి. హత్య చేసిన వారికే మళ్లీ జగన్ టికెట్ ఇచ్చాడు. అందుకే నేను పోటీ చేస్తున్నా. ఒక మాజీ సీఎం తమ్ముడు, ప్రస్తుత సీఎం సొంత చిన్నాన్నను హత్య చేసిన వారికి శిక్ష పడకపోతే ఇక సామాన్యులకు ఏం న్యాయం జరుగుతుంది. అవినాశ్‌రెడ్డి నిందితుడు అంటూ సీబీఐ ఆధారాలు చూపించింది. మరి అలాంటి వారిని జగనన్న కాపాడుతున్నాడు. సీబీఐ కూడా అవినాశ్ వెంట్రుక పీకలేకపోయింది" అంటూ షర్మిల పులివెందుల పూలంగళ్లు వేదికగా అటాక్ చేశారు.


"వైఎస్సార్, వివేకాకు ఈ గడ్డ అంటే ఎంతో ప్రేమ. బతికినంత కాలం ఇక్కడి ప్రజల కోసమే బతికారు. ఈ ప్రాంత ప్రజల కోసం పాటుపడ్డారు. జనం మధ్యలో ఉండేవారు. చనిపోయాక కూడా ఇక్కడే నిద్రిస్తున్నారు. వైఎస్సార్, వివేకా ఇద్దరూ వెళ్లిపోయారు. కొంగుచాపి అడుగుతున్నాం.. మీ ఆడబిడ్డలం అడుగుతున్నాం.. న్యాయం చేయండి.. ధర్మాన్ని గెలిపించండి" అంటూ పులివెందులలో షర్మిల, సునీతలు భావోద్వేగంతో చేసిన ప్రసంగం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వివేకాను చంపించింది అవినాశ్‌రెడ్డి అంటూ పులివెందుల నియోజకవర్గ పర్యటనలో అక్కా చెల్లెళ్లు ఏకిపారేశారు.

పులివెందులలోనూ విశేష ఆదరణ

జిల్లాలో జన స్పందన ఎలా ఉన్నా పులివెందులలో ఆదరణ ఉండదని జగన్ శిబిరం భావించిందంటారు. అయితే పులివెందుల గడ్డపైన షర్మిలాకు అపూర్వస్వాగతం లభించింది. వేంపల్లెలో జరిగిన బహిరంగసభకు మండుటెండకు లెక్కచేయకుండా భారీగా తరలివచ్చారు. లింగాలలో వైసీపీ మూకలు ఆటంకాలు చేయడానికి చూసినా మేమూ పులివెందుల బిడ్డలమే.. పులివెందుల పూలంగళ్ల వద్ద పంచాయితీ పెట్టుకుందామా అంటూ సవాల్ విసిరారు. ఇక పులివెందుల సభ చూసి జగన్ శిబిరం మైండ్ బ్లాక్ అయిందంటారు. షర్మిల ప్రోగ్రాంకు వెళ్లి ఫొటోలో కనిపిస్తే మీకు సంక్షేమ పథకాలు కట్ అవుతాయి, వచ్చేది మన ప్రభుత్వమే అంటూ వైసీపీ బ్యాచ్ ఎంత బెదిరించినా జనం ఆ బెదిరింపులు లెక్క చేయలేదు. రాజన్న బిడ్డను చూడాలని, ప్రసంగం వినాలని అడ్డంకులు లెక్క చేయకుండా వచ్చారు. వేంపల్లె, లింగాలలో జనాదరణ చూసి పులివెందులలో షర్మిలా తిరిగే ప్రాంతాల్లో కావాలనే విద్యుత్ సరఫరా కట్ చేశారని విమర్శ ఉంది.

ఉతికి ఆరేశారు

షర్మిల ఐదు రోజులు కడపజిల్లా పర్యటనలో సీఎం జగన్ పాలనలో వైఫల్యాలను ఉతికి ఆరేశారు. వైఎస్ అంటే సాగునీటి ప్రాజెక్టులు గుర్తుకు వస్తాయి. జగన్ సీఎం అయిన తరువాత సాగునీటి ప్రాజక్టులు లేవని అన్నారు. ప్రతిపక్ష హోదాలో ప్రత్యేక హోదా అంటూ రంకెలేసి ఇప్పుడు బీజేపీ బానిసగా మారాడన్నారు. స్టీలుఫ్యాక్టరీకి రెండుసార్లు శంకుస్థాపన చే శాడన్నారు. ఇలా ప్రభుత్వ వైఫల్యాలపై వరుస పెట్టి ఉతికి ఆరేశారు. బద్వేలు, కడప కమలాపురం, మైదుకూరు, పులివెందుల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గాల్లో షర్మిలా బస్సు యాత్ర సాగింది. అన్నిచోట్ల షర్మిలాకు బ్రహ్మరథం పట్టారు. అగ్నికి ఆజ్యం తోడైనట్లు షర్మిలాకు సునీత తోడయ్యారు. ఇద్దరూ సూటిగా వివేకాను హత్య చేయించింది ఎంపీ అవినాశ్‌రెడ్డి , ఆయనను కాపాడేది సీఎం జగన్‌రెడ్డి అంటూ జనాలకు తెలిపారు. ఇప్పుడు షర్మిలా బస్సుయాత్రతో ఐదురోజులుగా వివేకా హత్యపై జిల్లాలో జోరుగా చర్చ నడుస్తోంది. జిల్లాలో ఇది బాగా చర్చనీయాంశం కావడంతో వైసీపీని కలవరపాటుకు గురిచేసింది. మేం ఊహించని విధంగా పులివెందులలో షర్మిలా సక్సెస్ అయింది.. మాకు మైనస్ అంటూ ఓ వైసీపీ నేత వ్యాఖ్యానించారు. ఇంకా ఎన్నికలకు నెల టైముంది. ఇది కేవలం టీజరే.. సినిమా ముందు ఉందంటూ షర్మిల అంటున్నారు. జవసత్వాలు ఉడిగి పోయిన కాంగ్రెస్‌కు షర్మిల బస్సు యాత్రతో పెద్ద బూస్ట్‌గా మారింది.



ఎన్నికల్లో పోలింగ్ కీలకమైనది

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 13: ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ అత్యంత కీలకమైనదని, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు ప్రతి అంశాన్ని సూక్ష్మ పరిశీలన అవగాహనతో చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. శనివారం నగరంలోని గాంధీనగర్‌లోని ఉన్నత పాఠశాలలో సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా ప్రిసైడింగ్, సహాయ అధికారులకు కడప నియోజక వర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో మధుసూదన్ అధ్యక్షతన శిక్షణా కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు సజావుగా, నిష్పక్ష పాతంగా, పారదర్శకంగా జరిగేందుకు ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమన్నారు. పూర్తి అవగాహనతో పోలింగ్‌ను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు డెమో బ్యాలెట్ బాక్సులు, ఈవీఎం, వీవీప్యాట్ చూపిస్తూ వాటి నిర్వహణ ఎలా చేపట్టాలనే అంశాలపై పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా వివరించారు.



పీవో, ఏపీవోల శిక్షణను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి

24 గంటల్లో సంజాయిషీ ఇవ్వండి

- జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికల విధులకు సంబంధించి శిక్షణకు గైర్హాజరైన పీవోలు, ఏపీవోలు 24 గంటల్లోగా సంజాయిషీ సమర్పించాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా 4,950 మందికి ఎన్నికల విధులు కేటాయించి పీవోలు, ఏపీవోలకు 13, 14 తేదీల్లో రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే మొదటి రోజు శనివారం 2,400 మందిలో 41 మంది గైర్హాజరు అయ్యారన్నారు. శిక్షణకు హాజరుకాని కాని పీవోలు, ఏపీవోలను క్రమశిక్షణా రాహిత్య చర్యల కింద షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. 24 గంటల్లోగా సంజాయిషీ ఇవ్వాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రీరాముడు నడయాడిన నేల..

- శిల్పకళా లోగిలి.. ఏకశిలా నగిరి
- ఒంటిమిట్ట.. ఆధ్యాత్మిక పుట్ట
- 16 నుంచి 26వ తేదీ వరకు ఒంటిమిట్ట కోదండరాముని బ్రహ్మోత్సవాలు
- 17న ధ్వజారోహణం.. 21న రాత్రి గరుడ సేవ.. 22న రాత్రి కల్యాణం

ఆంధ్ర భద్రాద్రిగా వాసికెక్కిన ఒంటిమిట్ట కోదండరాముని బ్రహ్మోత్సవాలు ఈ నెల 16 నుంచి 26వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. ఆలయ ప్రాంగణాన్ని, చుట్టుపక్కల ప్రాంతాలను, ఈ నెల 22వ తేదీ రాత్రి జరిగే కల్యాణోత్సవ ప్రాంగణాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతున్నారు. వందలాది మంది టీటీడీ కార్మికులు, వివిధ విభాగాల నైపుణ్య సిబ్బంది ఈ ఏర్పాట్లలో లీనమయ్యారు. ఎంతో ప్రాశస్త్యం కలిగిన ఈ ఆలయ చరిత్రపై బ్రహ్మోత్సవాల వేళ ప్రత్యేక కథనం..





రాజంపేట, ఏప్రిల్ 13: అపురూప ప్రాచీన శిల్పకళకు కాణాచిగా ఆంధ్రాకు అపూర్వ ఆభరణంగా భక్తి సుగంధాలను పంచే సౌధంగా ఒంటిమిట్ట కోదండరామాలయం విరాజిల్లుతోంది. పురాణ ప్రాశస్త్యం, చారిత్రక నేపథ్యం కలిగిన ఈ రామాలయం కడప-చెన్నై ప్రధాన రహదారిలో కడప నుంచి 25 కి.మీ దూరంలో, రాజంపేట నుంచి 30 కి.మీ దూరంలోని ఒంటిమిట్టలో ఉంది. ఒకే రాతి గుట్టపై మూడు గోపురాలతో 32 అద్భుత శిల్పమయ స్తంభాలతో రంగమండపం, కల్యాణమండపం ఈ ఆలయం సొంతం. సీతారామలక్ష్మణులు ఒకే శిలపై ఉన్నందున ఒంటిమిట్ట ఏకశిలా నగరంగా పేరుగాంచింది. దేశంలో హనుమ లేని రామాలయం లేదంటే అతిశయోక్తి కాదు. అందుకు భిన్నంగా హనుమంతుడు లేకుండా నిర్మించిన ఏకైక ఆలయం ఒంటిమిట్ట కోదండరామాలయం.

బ్రహ్మోత్సవాల వివరాలు

16 నుంచి 26వ తేదీ వరకు ఒంటిమిట్ట కోదండరాముని బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 16న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరగనుంది. 17న ధ్వజారోహణం, రాత్రి శేషవాహనంపై స్వామి దర్శనమిస్తారు. 18న వేణుగానాలంకారం, రాత్రి హంసవాహన సేవ జరగనుంది. 19న వటపత్రసాయి అలంకారం, రాత్రి సింహ వాహనంపై ఊరేగింపు ఉంటాయి. 20న నవనీత కృష్ణాలంకారం, రాత్రి హనుమంత వాహన సేవ.. 21న మోహినీ అలంకారం, రాత్రి గరుడ సేవ జరగనున్నాయి. 22న శివదనుర్బాలంకారం, రాత్రి సీతారాముల కల్యాణోత్సవం జరగుతాయి. 23న రథోత్సవం, 24న కాళీయమర్ధనాలంకారం, రాత్రి హంసవాహన సేవ, 25న చక్రస్నానం, 26న పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి.

చరిత్ర పుటల్లో..

మట్లి పాలకుల్లో ఒకరైన సదాశివరాయుల కాలం నాటి శిలాశాసనాలను బట్టి చూస్తే ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని 1350వ సంవత్సరంలో ఉదయగిరిని పాలించిన కంపరాయులు నిర్మించినట్లు తెలుస్తోంది. 1356లో ఉదయగిరి సింహాసనాన్ని అధిష్ఠించిన కంప సోదరుడైన బుక్కరాయులు ఒంటిమిట్ట కోదండరామాలయాన్ని నిర్మించాడు. మట్లిరాజుల్లో ఒక్కడైన అనంతరాజు గుడిని విస్తరించాడు. తూర్పుగాలిగోపురం, మహామండపం, మహాప్రాకారం, రథం నిర్మించారు. అలాగే ఉత్తర, దక్షిణ గోపుర నిర్మాణాలు మొదలు పెట్టగా అనంతరాజు కుమారుడైన తిరువెంగళనాధ రాజు, మనుమడు కుమార అనంతరాజు పూర్తి చేశారు. ఒంటిమిట్ట కోదండరామాలయంలో రెండు శాసనాలు ఉన్నాయి. మొదటి శాసనం క్రీ.శ.1555లో, రెండవ శాసనం క్రీ.శ. 1558లో వేయించారు. వీటి ప్రకారం విజయనగర పాలకుడు వీరసదాశివరాయల సామంతుడు గుత్తి తిరుమలయ్య దేవమహారాజు పులపత్తూరు గ్రామాన్ని ఆలయానికి దానంగా ఇచ్చాడు. కోదండరామాలయ ప్రాకార నిర్మాణాలకు, రథం, బ్రహ్మోత్సవాల నిర్వహణకు తిరుమల రాజయ్య, నాగరాజయ్య దేవమహరాజులు ఒంటిమిట్టను, ఈ గ్రామానికి చెందిన పల్లెలను, పొలాలను దానంగా ఇచ్చారు.

ఇతిహాస చరిత్ర

పితృవాక్య పరిపాలకుడైన శ్రీరామచంద్రుడు అరణ్యవాసం చేస్తూ ఒంటిమిట్టకు వచ్చినట్లు ఇతిహాసం చెబుతోంది. ఇక్కడ మునులు తపస్సు చేసుకుంటూ ఉండేవారు. వీరికి రాక్షసుల బెడద ఎక్కువగా ఉండటంతో యజ్ఞయాగాదులు నిర్వహించలేకపోయారు. మహాముని కోరికపై రామలక్ష్మణులు రాక్షస సంహారం చేసినట్లు చెబుతారు. అనంతరం మునుల యజ్ఞయాగాదులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఒకేశిలలో నిర్మితమైన సీతారామలక్ష్మణ విగ్రహాలను మునులకు ప్రదానం చేశారట. ఆనాటి దండకారణ్యంలో భాగంగా శ్రీరాముడు అంబులపొది, పిడిబాకు, కోదండం చేతపట్టి రావడంతో కోదండరాముడు అనే నామం వచ్చింది.

స్థానిక కథనం

త్రేతాయుగంలో ఒంటిమిట్ట ప్రాంతానికి వచ్చిన జాంబవంతుడు ఒకనాటి రాత్రి విశ్రమించగా స్వప్నంలో సీతారామలక్ష్మణులు దర్శనమిచ్చారట. జాంబవంతుడు ఉదయమే లేచి పరిసరాలను వెతకగా ఒక గుబురు పొదల్లో ఈ మూర్తుల విగ్రహాలు కనిపించాయి. దాంతో జాంబవంతుడు ఆనందభరితుడై సీతారామలక్ష్మణ విగ్రహాలను ప్రతిష్ఠించాడు.

ఇమాంబేగ్ పిలుపు.. రామయ్య పలుకు..

స్థానికంగా మరో కథనం ప్రాచుర్యంలో ఉంది. క్రీ.శ.1640 ప్రాంతంలో కడపను పాలించిన అబ్దుల్ నబీఖాన్ ప్రతినిధి ఇమాంబేగ్ ఒంటిమిట్ట కోదండరాముని మహిమను పరీక్షించేందుకు వచ్చాడట. గుడిలోపలికి వెళ్లి ఓ రామ..! ఒంటిమిట్ట రఘురామ..! అని మూడుమార్లు పిలువగా గుడిలోంచి ఓ ఓ ఓ.. అనే సమాధానం వినపడింది. అంతట ఇమాంబేగ్ ఆనందంతో మోకరిల్లి రాముని భక్తునిగా మారాడు. శ్రీరాముని కైంకర్యం కోసం ఒక బావిని కూడా తవ్వించాడు. ఆలయం వద్ద ఆ బావిని నేటికీ చూడవచ్చు. అందువల్లే ప్రతి శుక్రవారం ఒంటిమిట్ట మండలం మంటపంపల్లె దర్గాకు వెళ్లే ముస్లింలు తిరిగి వస్తూ కోదండరాముడ్ని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి వెళతారు.

ఒంటిమిట్ట పేరు ఎలా వచ్చిందంటే..

ఒంటడు-మిట్టడు అనే ఇద్దరు అన్నదమ్ములు ఈ ప్రాంతంలో వేటమీద జీవనం సాగించే వారు. ఒకసారి కంపరాయలు, ఆయన పరివారం ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు వీరు శ్రీరాముడు సృష్టించిన బుగ్గనీటితో దప్పిక తీరుస్తారు. అంతట ఈ కంపరాయలు ఈ అన్నదమ్ముల కోరికపై జాంబవంతుడు ప్రతిష్ఠించిన ఏకశిలా దేవతా మూర్తులకు గర్భాలయం నిర్మిస్తారు. తరువాత వీరి పేరుపై ఒంటిమిట్ట గ్రామాన్ని, చెరువును కట్టిస్తారు.

అపురూప శిల్పసంపద

ఒంటిమిట్ట కోదండరామాలయంలోని అపురూప శిల్పసంపద పర్యాటకులను మైమరిపిస్తోంది. రంగమండపంలోని 32 శిలా స్తంభాల్లో మూడు ముఖాలు కలిగిన అపురూప శిల్పాలు రామాయణ, భాగవతాల్లోని ఘట్టాలను ప్రతిబింబించేవి ఆకట్టుకుంటున్నాయి.







ప్రొద్దుటూరు ఒన్‌టౌన్ సర్కిల్లో ప్రజలకు అభివాదం చేస్తున్న షర్మిల



వైఎస్సార్ కాంగ్రెస్‌లో.. వైఎస్ కనుమరుగయ్యాడు

- షర్మిల వైఎస్‌కు పుట్టలేదని రాచమల్లు విజయమ్మను అవమానించాడు
- ఎమ్మెల్యే, ఎంపీ, సీఎంను కాలర్‌పట్టుకుని నిలదీయండి
- ప్రత్యేక హోదా, ఉక్కుఫ్యాక్టరీ కోసం మోదీని నిలదీశారా
- హంతకుడిని మళ్లీ ఎంపీ చేసి పార్లమెంటుకు పంపుతారా
- వైఎస్ బిడ్డ షర్మిలాను న్యాయంకోసం ఎంపీగా గెలిపిస్తారా
- న్యాయ నిర్ణేతలు మీరే : పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల
- షర్మిల బస్సుయాత్రకు విశేష స్పందన
- ముద్దనూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరులో జనం భారీగా హాజరు

ప్రొద్దుటూరు/జమ్మలమడుగు/ముద్దనూరు ఏప్రిల్ 13: "వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో వైఎస్ కనుమరుగయ్యాడు. అందులో ఉన్నదంతా వైవీ సుబ్బారెడ్డి, విజయ సాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డిలు మాత్రమే" అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల అన్నారు. న్యాయ్ యాత్ర పేరిట ఆమె చేపట్టిన బస్సుయాత్ర ఐదోరోజు శనివారం ముద్దనూరు నుంచి మొదలై జమ్మలమడుగు మీదుగా ప్రొద్దుటూరుకు చేరుకుంది. ఇందులో భాగంగా సీఎం జగన్ రెండుసార్లు శంకుస్థాపనలు చేసిన స్టీల్ ప్లాంట్ శిలాఫలకాలను ఆమె సందర్శించారు. ఊరూరా ఆమెకు ప్రజలు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రొద్దుటూరుకు మీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఎంపీ అవినాశ్‌రెడ్డి ఏమి చేశారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే రాచమల్లు షర్మిలారెడ్డి వైఎస్సార్‌కే పుట్టలేదని మాట్లాడి విజయమ్మను ఘోరంగా అవమానించాడన్నారు. రాచమల్లును గుర్తు చేసుకోమని చెబుతున్నా.. జగన్‌రెడ్డి జైల్లో ఉన్నప్పుడు వైసీపీని భుజాన మోసింది షర్మిల అన్నారు. 3200 కిలో మీటర్లు పాదయాత్ర చేసి పార్టీని నిలబెట్టింది షర్మిల అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్‌లో వైఎస్‌ను సాక్షి చానల్ నుంచి పేపర్ నుంచి ఆఖరికి సంక్షేమ పథకాల నుంచి కూడా దూరం చేశారన్నారు.

మీ ఎమ్మెల్యే రాచమల్లు గానీ ఎంపీ అవినాశ్‌రెడ్డి సీఎం జగన్ గానీ అసెంబ్లీ, పార్లమెంటులో ఏనాడైనా ఉక్కు ఫాక్టరీ కోసం మాట్లాడారా అన్నారు. 25 మంది ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని మోసం చేశారన్నారు. ఇంట్లో ఎంత మంది బిడ్డలుంటే అంతమందికి అమ్మవడి అన్నారు. ఎందరికి ఇస్తున్నారని ప్రశ్నించారు. మద్యం నిషేధం అమలు చేస్తానని చెప్పి మహిళలను మోసం చేశాడన్నారు. ఐదేళ్లలో పట్టుమని పది పరిశ్రమలు కూడా తేలేకపోయాడన్నారు. నిరుద్యోగుల రాష్ట్రంగా తయారు చేసి యువకులు ఇతర రాష్ట్రాలకు వలసలు వేళ్లే పరిస్థితి కల్పించావన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రజలు ఇచ్చిన సీఎం అధికారాన్ని అడ్డుపెట్టుకుని హత్యారాజకీయాలు చేస్తున్నారన్నారు. వివేకానందరెడ్డిని క్రూరంగా గొడ్డలితో నరికి చంపించిన వ్యక్తి అవినాశ్‌రెడ్డిని దగ్గర పెట్టుకుని కాపాడుతున్నాడన్నారు. హంతకుడిని ఐదేళ్లపాటు కాపాడుతూ ఇప్పుడు మళ్లీ పార్లమెంటుకు పంపాలని చూస్తున్నారన్నారు. వైఎస్ బిడ్డ న్యాయం కోసం ధర్మం గెలవడం కోసం కడప పార్లమెంటుకు పోటీ చేస్తోందన్నారు.

హత్యారాజకీయాలు పోవాలంటే షర్మిల గెలవాలి : సునీత

జిల్లాలో హత్యా రాజకీయాలు పోవాలంటే షర్మిల గెలవాలని వైఎస్ వివేకానందరెడ్డి కూతురు డాక్టర్ సునీత పేర్కొన్నారు. వివేకానంద రెడ్డి హత్యలో న్యాయం కోసం ఎక్కని మెట్టులేదు తట్టని తలుపు లేదన్నారు. స్వంత చిన్నాన్నను చంపిన వాళ్లు ఎవ్వరో సీబీఐ చెప్పినా కూడా సీఎం జగన్ వారిని కాపాడుతున్నాడన్నారు, అందుకే న్యాయంకోసం షర్మిల పోరాడుతోందన్నారు. ఆమెను పార్లమెంటుకు పంపితే జిల్లాప్రజల కోసం కొట్లాడుతుందన్నారు. కాగా.. పి.గన్నవరం ఎమ్మెల్యే చిట్టిబాబు ముద్దనూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ బస్సుయాత్రలో కాంగ్రెస్ మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దాదాపీర్, ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీఎండీ నజీర్, సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యుడు రామయ్య, జమ్మలమడుగు కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు పాముల బ్రహ్మానందరెడ్డి, భూతమాపురం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



జమ్మలమడుగులో వైఎస్ షర్మిల రోడ్‌షోకు హాజరైన జనం

ఫేక్ న్యూస్‌పై ఫోకస్

- నకిలీ కథనాలు రాస్తే మూడేళ్ల వరకు జైలు

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 13: ఎన్నికల సమయంలో రెండు వర్గాల మధ్య ఘర్షణలు, లా అండ్ ఆర్డర్‌కు విఘాతం కలిగించడం, ఎన్నికల సమగ్రతకు ఆటంకం కల్పించే నకిలీ కథనాలు, ఫేక్ న్యూస్‌పై జిల్లా ఎన్నికల యంత్రాంగం నిఘా పెట్టిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలలో తప్పుడు కథనాలు ప్రసారం జరిగినా, ప్రచురితం అయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్వేష పూరిత ప్రసంగం, నకిలీ వార్తలు సోషల్ మీడియాలో ప్రసారం అయితే సంబంధిత సందేశాలను పోస్టు చేసిన వారికి మూడేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుందన్నారు. సమూహాల మధ్య శత్రుత్వాన్ని పెంచితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎగ్జిట్ పోల్ నిర్వహించడం, వాటి ఫలితాలను ప్రచారం చేసినా చర్యలు తప్పవన్నారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బట్టబయలైన వర్గపోరు

● ఆకేపాటి సమక్షంలో ఇరువర్గాల మాటల యుద్ధం

● ప్రచారం నుంచి వెళ్లిపోయిన నేతలు



పెదినేనికాలువ పర్యటనలో ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

సుండుపల్లె, ఏప్రిల్13: వైసీపీ నేతల మధ్య వర్గపోరు రాజంపేట వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సమక్షంలో బట్టబయలైంది. రెండో రోజు పర్యటనలో భాగంగా పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీకి వెళ్లిన ఆయనకు చేదు అనుభవం ఎదురైంది. కొద్ది రోజులుగా రెండు వర్గాలు పార్టీలో ఉన్నట్లు, అంతా ఒక్కటైనట్లు ప్రచారంలో పాల్గొన్నారు. అయితే చత్రం సమీపంలోని మామిడి కాయల నుంచి వద్ద మాటల యుద్ధం జరిగినట్లు సమాచారం. మరో గ్రామానికి వెళ్లి పర్యటన చేయాలని ఒక వర్గం నేతలు ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రోత్సహించగా, ఇదే గ్రామంలో షెడ్యూల్ ప్రకారం పర్యటించాలని స్థానికులు, మరో వర్గం నేతలు డిమాండ్ చేస్తూ ఆకేపాటి ఎదుట వాగ్వాదానికి దిగారు. అయితే వాళ్ల చెప్పిందే చేసుకోండి మాకెందుకు ఆ పార్టీ అని ఓ వర్గం నేతలు ఎన్నికల ప్రచారం నుంచి వెళ్లిపోయినట్లు వైసీపీ నేతలే చర్చించుకున్నారు. ఇరువర్గాల మధ్య దాడి జరిగేలా మాటల యుద్ధం సాగినట్లు ప్రచారానికి వెళ్లిన కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొట్టుకునేందుకే ప్రచారానికి వచ్చారా అనే అనుమానం పలువురిలో తలెత్తింది. పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ నేతలు చెప్పిన విధంగానే ప్రచారం చేయాలని, లేదంటే అంగీకరించేది లేదని ఆ గ్రామ పంచాయతీ నేతలు, కార్యకర్తలు తెగేసి చెప్పడంతో ఎమ్మెల్యే అభ్యర్థి అక్కడే ప్రచారం నిర్వహించాల్సి వచ్చింది. ప్రచారంలో ప్రజల నుంచి స్పందన లేదు. మరోవైపు వర్గపోరు తీవ్రస్థాయిలో ఉండడంతో ప్రచారం నామమాత్రంగా సాగిందని మండలంలో చర్చనీయాంశమైంది.

అనుమానం పెనుభూతమై.....

భార్యను హతమార్చిన భర్త



ఆదిలక్షుమ్మ మృతదేహం

పెద్దముడియం, ఏప్రిల్ 13: భార్యపై చిగురించిన అనుమానం పెరిగి పెనుభూతమై పుట్టింట్లో నిద్రిస్తున్న భార్య ఆదిలక్ష్మి(28)ని భర్తే క్రూరంగా హతమార్చడం మండలంలో సంచలనమైంది. పెద్దముడియం మండలం కలవటాల గ్రామంలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఉదంతంపై పోలీసులు అందించిన మేరకు వివరాల్లోకెళితే...

మైలవరం మండలం కల్లుట్ల గ్రామస్థుడు సహదేవుడికి పెద్దముడియం మండలం కలవటాల వాసి ఆదిలక్ష్మితో 15 ఏళ్ల కిందట వివాహమైంది. అయితే భార్యాభర్తల మధ్య ఇటీవల తరచూ గొడవ జరుగుతోంది. భర్త సహదేవుడుతో రెండు నెలల కిందట గొడవ పడిన ఆదిలక్ష్మి పుట్టినిల్లు కలవటాలకు వచ్చి ఇక్కడే ఉంటోంది. ఈ నేపథ్యంలో భార్యపై పగ పెంచుకున్న సహదేవుడు శనివారం తెల్లవారుజామున తల్లి ఇంటి వద్ద నిద్రిస్తున్న ఆదిలక్ష్మిపై కత్తితో దాడి చేశాడు. నిద్రలో దాడి జరగడంతో ఆదిలక్ష్మి ప్రతిఘటించే పరిస్థితి లేదు. గొంతుపై విచక్షణారహితంగా కత్తితో కోసి కడతేర్చాడు. పక్కనే ఉన్న ఆదిలక్ష్మి తల్లి వెంకటమ్మ తేరుకునేలోపే ఈ ఘటన జరిగిపోయింది. ఆమె గట్టిగా అరవడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. భార్యను అంతమొందించిన సహదేవుడు నేరుగా తలమంచిపట్నం పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం. మృతురాలు ఆదిలక్ష్మి తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు పెద్దముడియం పోలీసులు కేసు నమోదు చేశారు.

రైల్వేకోడూరులో ఆరు పూరిళ్లు దగ్ధం



కాలిపోయిన పూరిల్లు

రైల్వేకోడూరు, ఏప్రిల్13: గాంధీనగర్ చందన్ సినిమాస్ సమీపంలో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆరు పూరిళ్లు దగ్ధమయ్యాయి. రైల్వేకోడూరు అగ్నిమాపక కేంద్రం అధికారి కె.విజయ్‌కుమార్ కథనం మేరకు పట్టణంలోని గాంధీనగర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో చిన్న ఓబులేసు, రమాదేవి, మల్లయ్య, మంజు, మద్దిలేటి ఎల్లప్ప, మారెమ్మ పూరిళ్లు కాలిపోయాయి. ఇళ్లల్లో ఉన్న వంట సామగ్రి తదితరవి పూర్తిగా ఖాళీ బూడిదయ్యాయి. దీంతో 1,90,000 నష్టం వాటిల్లినట్లు తెలిపారు. సమాచారం రాగానే హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి పక్క ఇళ్లకు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. సమాచారం తెలుసుకున్న వీఆర్వో భారతి సంఘటన స్థలానికి వెళ్లి వివరాలను తెలుసుకుని రెవెన్యూ శాఖ అధికారులకు వివరించారు. అగ్ని బాధితులకు బియ్యం, రూపాయలు ఐదువేలను వారివారి అకౌంట్‌లో జమచేస్తారన్నారు. ఇళ్లు కాలిపోయిన అగ్నిబాధితులకు బియ్యం, రూపాయలు ఐదువేలును వారివారి అకౌంట్‌లో జమచేస్తారన్నారు. ఇల్లు కాలిపోయిన అగ్ని బాధితులు ఇతర ప్రాంతాల నుంచి రైల్వేకోడూరుకు వలస వచ్చారని, సుమారు ఆరేళ్లగా ఇక్కడ నివాసం ఉంటున్నారని ఆమె తెలిపారు. పూర్తి నివేదికను ప్రభుత్వానికి రెవెన్యూ శాఖ అధికారులు పంపుతారని వివరించారు. అగ్ని బాధితులకు ఇంటి స్థలాలు, పక్కా గృహాలు నిర్మించాలని టీడీపీ నేతలు మౌలా, పోతురాజు నవీన్, నార్జాల హేమరాజు డిమాండ్ చేశారు. అగ్ని బాధితులను పరామర్శించారు.

పవర్ లిఫ్టింగ్‌లో నాగరాజుకు బంగారు పతకం

ఇంటర్‌నేషనల్ స్థాయిలో సత్తాచాటిన తెలుగోడు



లక్కిరెడ్డిపల్లె ఏప్రిల్13: మూరుమూల గ్రామీణ యువకుడు కొర్లకుంట నాగరాజు పవర్‌లిఫ్టింగ్‌లో 74 కిలోల విభాగంలో 430 కిలోలు ఎత్తి అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించి తెలుగోడి సత్తా చాటాడు. దప్పేపల్లె పంచాయతీ మేడిమాకులగుంత గ్రామస్థుడు కొర్లకుంట నాగరాజు నిరుపేద కుటుంబంలో జన్మించి డిగ్రీ వరకు చదివారు. కుటుంబ పోషణ నిమిత్తం తిరుపతిలో ఓ హోటల్‌లో పనిచేస్తూ పవర్‌లిఫ్టింగ్‌పై మక్కువ పెంచుకున్నారు. ఇది గమనించిన తిరుపతిలోని రాక్ జిమ్ అధినేతలు మొట్ట మొదటిగా రాష్ట్ర స్థాయిలో నంద్యాల, ఆదోనిలో జరిగిన పవర్‌లిఫ్టింగ్ 74 కిలోల విభాగంలో పాల్గొని 380 కిలోల బరువును ఎత్తి గోల్డ్‌మెడల్ సాధించారు. తరువాత 2023 డిశంబర్‌లో నేషనల్ స్థాయిలో హిమాచల్‌ప్రదేశ్, ధర్మశాలలో జరిగిన పవర్ లిఫ్టింగ్‌లో పాల్గొని 380 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం సాధించారు. అయితే (ఎస్‌బీకేఎఫ్) భారతీయ సంయుక్త ఖేల్ పౌండేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి 5వ తేదీ వరకు నేపాల్ పోహరాలో జరిగిన అంతర్జాతీయ స్థాయి పోటీలో పవర్‌లిఫ్టింగ్‌లో పాల్గొని 380 కిలోల బరువును ఎత్తి భారత్ స్పోర్ట్స్ మినిస్టర్ పంకజ్‌గౌళ, శివతి నుంచి బంగారు పతకం అందుకున్నారు. అండర్ 11 నుంచి మాస్టర్ 4కేటగిరి వరకు అనేక విభాగాల్లో పాల్గొన్నట్లు నాగరాజు తెలిపారు.

శాశ్వత నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏసీ ముకుందరెడ్డి

చక్రాయపేట, ఏప్రిల్ 13: గండి క్షేత్రం శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,500 విరాళం అందించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. శనివారం గండి కార్యాలయంలో పుల్లంపేట మండలం రామసముద్రం వాసులు పోలి గంగయ్య, ధర్మపత్ని కనకమ్మ కుటుంబ సభ్యులు ఈ విరాళం అందించారన్నారు. వారికి స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందించారు.

కాదేదీ కూల్చివేతకు అనర్హం

● వైసీపీ నేతల ఆగడాలకు అడ్డేదీ ?

హైవేపై కల్వర్టు రక్షణ గోడ కూల్చివేత ● వెంచరు ముఖద్వారానికి అడ్డని....





కల్వర్టు రక్షణ గోడను తొలగించి మట్టితో చదును చేసిన దృశ్యం - వెంచర్‌కు అడ్డమని దాదాపు 20 అడుగుల గోడను తొలగించిన దృశ్యం

ప్రొద్దుటూరు ఏప్రిల్ 13: కాదేదీ కూల్చివేతకు అనర్హమని వైసీపీ ప్రభుత్వం కొత్త అంకానికి తెర తీసింది. వైసీపీ ప్రభుత్వం అంటే కూల్చివేత.. కూల్చివేత అంటేనే వైసీపీ ప్రభుత్వానికే చెల్లు అనే రీతిలో పాలన చేశారు. పాలకులే ఇలా ఉంటే బడా, చోటా నేతలు, అభిమానులు, కార్యకర్తలు తీరు ఎలా ఉంటుందనేది ప్రశ్నార్థకమే. ప్రస్తుతం ప్రొద్దుటూరులో వైపీపీ నేతల ఆగడాలకు అడ్డేలేకుండా పోతోంది. ఇటీవల ఎక్కడెక్కడి చుక్కలు, లిటిగెంట్ భూములు కొనుగోలు చేసి వెంచర్లు వేయడం వాటికి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా లేఅవుట్‌లు వేసి కోట్ల రూపాయలతో క్రయ విక్రయాలు జరుపుతున్నారు. దీనికి తోడు హైవేల మీద వున్న భూముల్లో వెంచర్లు వేసి అందులోకి నేరుగా రాకపోకలకు జరిగేందుకు వీలుగా అడ్డంగా వుండే హైవేపై వున్న కల్వర్టుల రక్షణ గోడలను రాత్రికి రాత్రి ఎక్స్‌కవేటర్లతో తొలగించి వారి వెంచర్లకు మార్గాన్ని వేసుకుంటున్నారు. వివరాల్లోకెళితే.. ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయితీ లింగాపురం వద్ద ఎస్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కాలేజి ఎదురుగా వైసీపీ ముఖ్యనేత వెంచరు వేశారు. ఆ వెంచరు ముఖ ద్వారానికి (ఆర్చీకి) అడ్డంగా వుందని ప్రభుత్వ ప్రాపర్టీ అయిన ప్రొద్దుటూరు - మైదుకూరు హైవేపై వున్న కల్వర్టు రక్షణ గోడను శుక్రవారం రాత్రి పది గంటలకు రాత్రిరాత్రికి ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్స్‌కవేటర్లతో కూల్చివేశారు. దాదాపు 20 అడుగులకు పైన వున్న రక్షణ గోడను కూల్చి మట్టి తోలకాలతో చదును చేశారు. కేవలం తన వెంచరు ముఖ ద్వారానికి ఎదురుగా కల్వర్టు గోడ అడ్డంగా వుందని వారు ఏకంగా కూల్చేస్తుంటే హైవే అధికారులు చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కపెడుతున్నారు. కొద్ది నెలల కిందట ఇదే హైవే పక్కన వున్న ఇరిగేషన్ డిపార్టుమెంట్‌కు చెందిన లస్కర్స్ క్వార్టర్సును రాత్రికి రాత్రి వైసీపీ నేతలు తమ వెంచరుకు అడ్డుగా వుందని కూల్చివేశారు. అప్పుడు ఇరిగేషన్ డీఈ ఏఈలు కూల్చిన ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌పై కేసులు పెట్టి చేతులు దులుపుకొన్నారు. ఆ వెంచరు యజమాని అయిన వైసీపీ నేతపై మాత్రం కేసు నమోదు చేయలేదు. శుక్రవారం రాత్రి కూడా వైసీపీకి చెందిన ముఖ్యనేత వెంచరు యజమాని ఈ కల్వర్టు కూల్చివేత ఘటనలో స్వయంగా దగ్గరవుండి చేపట్టినట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత హైవే ఆధారిటీ అధికారులు కల్వర్టు కూల్చివేత విషయంలో వైసీపీనేతపై పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటారా లేదా వేచిచూడాలి.

వివరణ :- ఈవిషయమై హైవే ఆధారిటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయభ్కార్ రెడ్డిని వివరణ కోరగా కల్వర్టు కరూల్చివేత ఘనటపై డీఈ నారాయణ నాయక్ ద్వారా ప్రొద్దుటూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రోబోటిక్ కీళ్ల మార్పిడితో త్వరగా రికవరీ

● సీమ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : సీఈఓ డాక్టర్ జయభారతి



విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ జహంగీర్ బాష, డాక్టర్ జయభారతి

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 13: రోబోటిక్ కీళ్ల మార్పిడితో తక్కువ కోత, వంద శాతం ఖచ్చితత్వంతో శస్త్ర చికిత్స జరుగుతుందని, త్వరగా కోలుకుంటారని ప్రముఖ కీళ్ల మార్పిడి, కీ హోల్ సర్జన్ డాక్టర్ ఎస్.జహంగీర్‌బాషా వెల్లడించారు. శనివారం కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న జేబీ హాస్పిటల్‌లో ప్రముఖ కీళ్ల మార్పిడి, కీ హోల్ సర్జన్ డాక్టర్ ఎస్.జహంగీర్‌బాషా మీడియా సమావేశంలో మాట్లాడుతూ హాస్పిటల్‌లో రోబోటిక్ కీళ్ల మార్పిడి చికిత్స విజయవంతంగా కొనసాగుతున్నాయి. రాయలసీమలోనే ప్రముఖ కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సల కేంద్రంగా జేబీ హాస్పిటల్ పేరుగాంచింది. రాయలసీమలోనే మొట్టమొదటిసారి కీళ్ళ మార్పిడిలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 40 ఏళ్ల పైబడి అపార అనుభవం కలిగిన వెలీస్ జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ వారి రోబో కీళ్ల మార్పిడి సర్జరీ లు తమ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోబోటిక్ అసిస్టెడ్ పద్ధతిలో కీళ్ల మార్పిడి చేయించుకోవడం ద్వారా అతి తక్కువ కోత, అతి తక్కువ రక్తస్రావం ఉంటుందన్నారు. 100 శాతం ఖచ్చితత్వం ఉంటుందని, ఇన్ఫెక్షన్ శాతం అతి తక్కువగా ఉంటుందన్నారు. సర్జరీ అనంతరం త్వరగా కోలుకుంటారని వివరించారు. జేబీ హాస్పిటల్లో రోబోటిక్ సర్జరీలు చేయించుకున్న వారు నేలపై కింద కూర్చుంటున్నారని, పద్మాసనం కూడా వేస్తున్నారని తెలిపారు. ఈ విధమైన కీళ్ల మార్పిడి సాంకేతిక భారతదేశంలోనే అతి తక్కువ సెంటర్లలో చేస్తున్నారని అందులో ఒకటి జేబీ హాస్పిటల్ అని చెప్పారు. అనంతరం జేబీ హాస్పిటల్ సీఈఓ డాక్టర్ ఎ. జయభారతి మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో అతి క్లిష్టమైన 16 రోబోటిక్ సర్జరీలను డాక్టర్ జహంగీర్ బాషా బృందం విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. రోబోటిక్ అసిస్టెడ్ పద్ధతిలో సర్జరీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ రోబోటిక్ ద్వారా స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నిక్, ఫాస్ట్‌ట్రాక్ టెక్నిక్ ఉపయోగించారని చెప్పారు. జేబీ హాస్పిటల్లో అనుభవజ్ఞులైన వైద్యులు డాక్టర్ ఉబేదుల్లా, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వెంకటేశ్వర్లు నిరంతర పర్యవేక్షణ చేయడంతో పేషెంట్ త్వరగా సాధారణ స్థితికి వస్తున్నారని చెప్పారు. మెట్రో నగరాల్లో అతి ఎక్కువ ధరకు మాత్రమే చేసే ఈ సర్జరీలు ఇప్పుడు జేబీ హాస్పిటల్లో సగం ధరకే చేస్తున్నట్లు చెప్పారు. రాయలసీమ ప్రాంతీయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అనంతరం సర్జరీ చేయించుకున్న చెంద్రాయుడు మాట్లాడుతూ ఆపరేషన్ చేయించుకున్నాక కింద కూడా కూర్చుంటున్నానని డాక్టర్ జహంగీర్ బాషాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఉబేదుల్లా, డాక్టర్ వెంకటేశ్వర్లు, ఓటీ ఇన్‌చార్జ్ ప్రసాద్‌బాబు, జేబీ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ వివేకాకు నివాళులర్పించిన వైఎస్ షర్మిల



పులివెందులలో వైఎస్ వివేకాకు నివాళులర్పిస్తున్న వైఎస్ షర్మిల, వైఎస్ సునీత

పులివెందుల రూరల్, ఏప్రిల్ 13: ఏపీసీసీ అధ్యక్షురాలు, కడప ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిల శనివారం చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డికి నివాళులర్పించారు. శనివారం ఉదయం పులివెందుల డిగ్రీ కళాశాల రోడ్డులోని వైఎస్ వివేకా సమాధి వద్దకు చేరుకున్నారు. వైఎస్ షర్మిల, వివేకా కుమార్తె డాక్టర్ వైఎస్ సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, బావమరిది శివప్రకాష్‌రెడ్డి వివేకా సమాధిపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిస్తూ మౌనం పాటించారు. నివాళులు అనంతరం బయటకు వచ్చిన వైఎస్ షర్మిలను అభిమానులు చుట్టుముట్టారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తుండగా పలువురు ఆమెను ఆశీర్వదించారు. యువతీ, యువకులు, మహిళలు సెల్ఫీలు తీసుకుంటూ షేక్‌హ్యాండ్ ఇస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పులివెందుల కాంగ్రెస్ నేత శ్రీనివాసులరెడ్డి తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయురాలి మృతి



ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 13: వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్ హైస్కూలు పాఠశాల ఇంగ్లీషు ఉపాధ్యాయురాలు ఎం.క్రిష్ణతులసి శుక్రవారం రాత్రి 11.30 గంటలకు గుండెపోటుతో మృతిచెందారు. ఆమె భర్త కరోనా సమయంలో మృతిచెందాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉండగా మొదటి కుమార్తె బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. రెండో కుమార్తె మానసిక వికలాంగురాలు. పదేళ్లగా వైవీఎస్ మున్సిపల్ హైస్కూలులో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఆమె మృతికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాశీప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వెల్లకిలా వేసిన 'వెలిగల్లు'

వేసవిలో పంటలు సాగు ● కోత సమయంలో రైతుకు నీటి ఇబ్బందులు

కుడి కాల్వకు నీళ్లు వదలాలని రైతన్నల ఆందోళన





నీళ్లులేక ఎండిపోతున్న వేరుశనగ, వరి పంట

లక్కిరెడ్డిపల్లె మార్చి13: ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవక కరవు తాండవించింది ఖరీఫ్‌లోనే సక్రమంగా వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్‌లో పంట సాగు తగ్గింది ఈ తరుణంలో చాలా మంది రైతులు అప్పటికే బోర్ల కింద వరినార్లు సాగుచేశారు. వెలిగల్లు ప్రాజెక్టు కుడికాల్వ అందించిన నీటితో ఖరీఫ్ పంట సరైన దిగుబడి రాకపోవడంతో కనీసం రబీలోనైనా అంతోఇంతో పంటలు సాగుచేసుకుంటే ఖరీఫ్‌లో చేసిన అప్పు తీర్చుకుందామని వెలిగల్లు ప్రాజెక్టు నీటిని నమ్ముకుని చెరువుల్లో నీరుందని రబీలో రామాపురం మండలంలో 900 హెక్టార్లు, లక్కిరెడ్డిపల్లె మండలంలో 800 హెక్టార్లలో చెరువుల కింద వరి, వేరుశనగ పంట, టమోట, పొద్దుతిరుగుడు, ఇతర కూరగాయల పంటలను సాగుచేశారు. రబీకి ప్రాజెక్టు నుంచి కూడా నీళ్లు వదులుతారని నమ్మకంతో అధికంగా పంటలు సాగు చేశారు. తీరా నీరులేక వెన్ను దశలో వరి, వేరుశనగ పంటలు ఎండిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. దీంతో రైతులు దిక్కుతోచక పంటలను వదులుకోలేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువుల్లో అరకొరగా ఉన్న నీటికోసం మోటార్లు, ఆయిలింజన్లతో నీటిని తోడి పంటలను తడుపుతున్నారు. మరి కొందరు రైతులు పంటలను వదులుకోలేక ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి పంటలను కాపాడుకుంటున్నారు. చెరువుల కింద ఉన్న బోర్లల్లోకి నీరు వచ్చినా ఫిబ్రవరి నుంచే ఎండలు మండుతుండడంతో బోర్లల్లో ఉన్ననీరు కూడా ఇంకిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుర్నూతల, పందిళ్లపల్లె, మూలపల్లె, దేవళంపల్లెల్లో వెలిగల్లు నీటిని నమ్ముకుని దాదాపు 200 ఎకరాల్లో వరిని సాగుచేశారు. కుర్నూతల పంచాయతీలోని అతిపెద్ద చెరువైన జీనగవాయిల చెరువుకు అప్పట్లో వెలిగల్లు నీటిని నింపడంతో ఎగువవడ్డె పల్లె, దిగువవడ్డెపల్లె రైతులు ఎక్కువగా వరి సాగుచేశారు. పందిళ్లపల్లె నుంచి కస్తూరిరాజుగాపల్లె వరకు రైతులు వెలిగల్లు ప్రాజెక్టు నీటిని నమ్ముకుని మళ్లీ రబీకి కూడా నీటిని వదులుతారనే ఆశతో పంటలు సాగుచేశామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరులేకపోడంతో వరి పంటను పొలంలోనే వదిలేశామని రైతులు సురేంద్ర, లక్ష్మీదేవమ్మ, సుధాకర్ చిన్నప్ప వాపోయారు. పంటలు ఎండిపోవడమే కాకుండా అరకొర పశుసంపదను సైతం అమ్ముకునే దీనస్థితికి చేరుకున్నామని నాగిరెడ్డి, వేమారెడ్డి, వెంటేశులు ఆవేదన చెందారు. రబీలో సాగుచేసిన పంటలను రక్షించుకోవాలంటే అధికారులు స్పందించి వెలిగల్లు ప్రాజెక్టు నీరు కుడికాల్వ ద్వారా పది రోజులు వదిలితే పంటలను రక్షించుకుంటామని రైతులు అధికారులను కోరుతున్నారు.

ప్రాజెక్టులో నీళ్లు తగ్గాయి

వెలిగల్లు ప్రాజెక్టులో నీళ్ల తగ్గాయి ప్రాజెక్టు కెపాసిటీ 4.64 క్యూసెక్‌ల నీరు నిల్వ ఉన్నప్పుడు ప్రాజెక్టుకు కుడి ఎడమ కాల్వలకు వదిలాము. ఈ ఏడాది వర్షాలు కురవక పోవడంతో ఆగస్టులో రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాల్లోని అన్ని చెరువులకు 5మీటర్ల నీరు వదిలాము వెలిగల్లు ప్రాజెక్టు నుంచి 5నెలలు సాగునీటిని అందించాం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో నీటి మట్టం తగ్గింది. కలెక్టర్ ఆదేశాల మేరకు రాయచోటి, గాలివీడు మండలాలకు తాగునీటిని అందిస్తున్నాం. రాయచోటి, గాలివీడు మండలాలకు తాగునీటిని అందిస్తున్నాం

రామమునెయ్యా జేఈ వెలిగల్లు ప్రాజెక్టు

మహిళ ఆత్మహత్య

కడప (క్రైం), ఏప్రిల్ 13: కడప నగరం మృత్యుంజయకుంటలో వివాహిత పెద్దకుల్లాయమ్మ (22) శుక్రవారం రాత్రి ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు చిన్నచౌకు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. కడప మృత్యుంజయకుంట వాసి పెద్దకుల్లాయమ్మకి అనంతపురం వాసి కుళాయప్పతో ఏడాది కిందట వివాహమైంది. వీరికి 11 నెలల సంతానం కలదు. శుక్రవారం రాత్రి భార్యాభర్తల మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో భర్త పిల్లను తీసుకెళ్లడంతో తీవ్ర మనస్థాపంతో ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బాకీ చెల్లించలేదని దాడి - కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 13: బాకీ డబ్బు చెల్లించకపోవడంతో తనను తీవ్రంగా కొట్టి గాయపరిచినట్లు వెంకటరమణ ప్రొద్దుటూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక సుందరయ్యకాలనీ వాసి చెన్నమ్మ వద్ద రూ. 4 లక్షలు అప్పు చేశాడు. డబ్బు అడిగే క్రమంలో శనివారం సాయంత్రం చెన్నమ్మ, తన అల్లుడు హేమంత్ మిత్రుడు సురేష్ వెంకటరమణ ఇంటికి వెళ్లి డబ్బు అడిగారు. తమ పరిస్థితి బాగోలేదనడంతో హేమంత్ టేబుల్ ఫ్యాన్‌తో దాడి చేయగా వెంకటరమణకు స్వల్పగాయమైంది. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఖాజీపేట, ఏప్రిల్ 13: పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు సీఐ రామాంజులు తెలిపారు. శనివారం ఉదయం అందిన సమాచారంతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని మైన్స్ అధికారులకు అప్పగించామన్నారు.

గెలిపించండి అందుబాటులో ఉంటా

● పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి విజ్ఞప్తి





తనకు ఓటు వేయాలని చక్రాయపేట మండలంలో అభ్యర్థిస్తున్న బీటెక్ రవి... మద్దిమడుగులో టీడీపీలో చేరిన వారితో పుత్తా నరసింహారెడ్డి... చెన్నూరు: టీడీపీకి మద్దతు తెలుపుతున్న విద్యార్థులతో పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

పులివెందుల/టౌన్/వేంపల్లె/చక్రాయపేట/లింగాల/తొండూరు/వేముల, ఏప్రిల్ 13: 'ఎన్డీయే కూటమి పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్నా గెలిపించండి, అందుబాటులో ఉంటూ అండగా ఉంటాను' అని మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) అన్నారు. శనివారం నియోజకవర్గంలోని చక్రాయపేట, లింగాల,తొండూరు మండలాలతో పాటు పులివెందుల పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చక్రాయపేట మండలంలోని మారెళ్లమడక, కొండవాండ్లపల్లె, గండి గ్రామాలలో బీటెక్ రవి ఇం టింటి ప్రచారం నిర్వహించి టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు తెలియజేశారు. మహాశక్తి పథకం, ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, రైతు నిధి తదితర పథకాలను వివరించారు. అలాగే పులివెందుల పట్టణంలో బీటెక్ రవి కుమారుడు రామ్‌రెడ్డి, వేంపల్లె మండలంలోని టి.వెలమవారిపల్లెలో మండల పరిశీలకులు రఘునాథరెడ్డి, లింగాల మండలంలోని ఇప్పట్ల గ్రామంలో బీటెక్ రవి సతీమణి లతారెడ్డి, తొండూరు మండలంలోని గంగాదేవిపల్లె గ్రామంలో, వేముల మండలంలోని నల్లచెరువుపల్లె గ్రామంలో బీటెక్ రవి సోదరుడు జోగిరెడ్డి తదితరులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ పులివెందుల అభ్యర్థి బీటెక్ రవి, ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డిలను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల టీడీపీ కన్వీనర్లు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటేయండి: పుత్తా క్రిష్ణచైతన్య

చెన్నూరు, ఏప్రిల్ 13 :ఇంజనీరింగ్ చదివే ప్రతి విద్యార్థి వారి భవిష్యత్తు బాగు కోసం టీడీపీకి ఓటు వేయాలని, తద్వారా వారి కుటుంబాల సంక్షేమం విద్యార్థుల అభివృద్ధి ఉంటుందని కమలాపురం టీడీపీ అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసీపీ పాలనలో ఎన్నో పరిశ్రమలు మూతబడ్డాయని, తద్వారా ఎంతో మంది యువత ఆ కర్మాగారాల్లో పనిచేసే వారు ఉపాధి అవకాశాలు కోల్పోయారన్నారు. అదే చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు తెచ్చారని, ముఖ్యంగా సాంకేతిక తను ప్రోత్సహించి ఇంజనీరింగ్ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. గతంలో హైదరాబాదు హైటెక్ సిటీ, కియా పరిశ్రమ లాంటివి ఎన్నో ఉన్నాయన్నారు. కానీ ఇప్పుడున్న పాలకులు రాష్ట్ర భవిష్యత్తును గాలికి వదిలేయడం అందరికీ తెలిసిందేనన్నారు. కావున విద్యార్థులు తమ భవిష్యత్తు బాగు కోసం ఎవరు మేలు చేస్తారో వారికే ఓటు వేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే ఆర్థిక స్వావలంబన కల్పించే శక్తిని ఒక్క చంద్రబాబు మాత్రమే తీసుకురాగలరని, అంతేగాని విద్యార్థులకు భిక్షం వేసే వ్యక్తులను ఎన్నుకోవద్దన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంటు సరిగ్గా రావడం లేదని, పోస్టు గ్రాడ్యుయేషన్‌కు ఇది వర్తించడంలేదని, పాత బకాయిలు పెండింగులో ఉన్నాయని కృష్ణ చైతన్య దృష్టికి తెచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంటు నేరుగా కాలేజీకి వచ్చేట్లు చూడాలన్నారు. చైతన్య మాట్లాడుతూ చంద్రబాబుకు ఆదాయ వనరులను సృష్టించి వాటిని పెంపు చేసే శక్తి ఉందని, ఆయన సంపద సృష్టించే మంచి దృష్టి ఉన్న గొప్ప నేత అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంటు నేరుగా కళాశాల ఖాతాకే వస్తుందని, పీజీకి కూడా వర్తించేట్లు చూస్తామన్నారు. అందుకే ప్రతి విద్యార్థీ తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తమ ఓట్లే కాకుండా తమ కుటుంబ సభ్యులందరి ఓట్లు కూడా టీడీపీకి వేయించాలని కోరారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ యశ్వంత్‌రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ కొమ్మా జనార్ధనరెడ్డి, టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు యల్లారెడ్డి, జిల్లా మైనార్టీ నేత షబ్బీర్‌హుసేన్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లిఖార్జునరెడ్డి, చెన్నూరు పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో...

టీడీపీ అధికారంలోకి వస్తే అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు రూ.20వేలు అందజేస్తామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తనయుడు కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. శనివారం వీరపునాయునిపల్లెలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ బైరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గండి ఓబయ్యయాదవ్, అరుణ్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఆర్‌పేట కృష్ణమోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, కుళాయప్ప, లోకేష్ యాదవ్, పాయసంపల్లె మాజీ సర్పంచు వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజన్ ఉన్న నేతతోనే అభివృద్ధి సాధ్యం

పెండ్లిమర్రి, ఏప్రిల్ 13: రాష్ట్రానికి ఏం కావాలో, ఎలా అభివృద్ధి చెందాలో తెలుసుకుని ముందుకెళ్లే విజన్ ఉన్న నాయకుడితోనే అభివృద్ధి సాధ్యమని, అలాంటి నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి కుమార్తె దివ్యశ్రీ, కోడలు శ్రీచైన్య పేర్కొన్నారు. శనివారం ఆరవేటి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని బుడ్డాయపల్లె, ఆరవేటిపల్లె, మాచునూరు, కొత్తపల్లె గ్రామాలలో పుత్తా కుటుంబ సభ్యులు కుమార్తె దివ్యశ్రీ, కోడలు శ్రీచైతన్య ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, ఆరవేటి చంద్రారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, నాయకులు రమణారెడ్డి, బ్రహ్మయ్య, రాజశేఖర్‌రెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, అన్నమయ్య, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

60 కుటుంబాలు టీడీపీలో చేరిక

సీకేదిన్నె, ఏప్రిల్ 13: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శనివారం మద్దిమడుగులో 60 కుటుంబాలవారు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా పుత్తా అల్లుడు, యశ్వంత్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. చింతకొమ్మదిన్నె మండలం అంగడివీధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి టీడీపీ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలన్నారు. మహిళా సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని మహిళలకే అధిక ప్రాధాన్యత ఇచ్చే ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.వి.క్రిష్టారెడ్డి, సాయినరసింహారెడ్డి, గంధం మోహన్‌బాబు, ఏటూరు రామచంద్రారెడ్డి, నరసింహులు యాదవ్, మునింద్రయాదవ్, శివశంకర్, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో అందరికీ మేలు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 13: చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలతో రాష్ట్ర ప్రజలందరికీ మేలు జరుగుతుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తల్లి సరళమ్మ పేర్కొన్నారు. శనివారం నగర పంచాయతీ పరిధిలోని 15, 17 వార్డుల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంతో పుత్తా జ్యోతిరెడ్డి సతీమణి, పుత్తా సరళమ్మతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ రాబోవు ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. మద్యపానం నిషేదం చేసి ఆ తరువాత ఓట్లు అడుగుతామని చెప్పిన జగన్ ఎక్కడ మద్యపాననిషేధం చేశారో చెప్పాలన్నారు. ఐదేళ్ల పాలనలో కమలాపురంలో ఏం అభివృద్ధి జరిగిందో చెప్పాలన్నారు.

అనంతరం టీడీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుత్తా వెంకటసుబ్బమ్మ, గొంగల్‌రెడ్డి స్వప్న, మేరీ భాగ్యలక్ష్మి, మోదిన్‌బీ, ఖాదర్‌బాషా, జంపాల నరసింహారెడ్డి, రాఘవరెడ్డి, దివాకర్‌రెడ్డి, కంకరసుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, వాసుదేవరెడ్డి, ఎల్లారెడ్డి, బోయిళ్లశంకర్‌రెడ్డి, రామమునిరెడ్డి, శ్రీకంత్, దాదిరామయ్య, నబీరసూల్, బీజేపీ మండల అధ్యక్షుడు శివకిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





లింగాలలో టీడీపీ పథకాలను వివరిస్తున్న బీటెక్ రవి సతీమణి లతారెడ్డి... పెండ్లిమర్రి: మాట్లాడుతున్న పుత్తా శ్రీచైతన్య, దివ్యశ్రీ... కమలాపురం: టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరిస్తున్న పుత్తా సరళమ్మ

పెద్ద దర్గాను సందర్శించిన సినీ నటుడు సప్తగిరి



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న సప్తగిరి

కడప (కల్చరల్), ఏప్రిల్ 13: తెలుగు సినిమా హీరో.. హాస్యనటుడు సప్తగిరి శనివారం ప్రఖ్యాత పెద్దదర్గాను సందర్శించారు. ఆయనకు పెద్ద దర్గా ప్రతినిధులు దర్గాలోని ప్రధాన మజార్‌ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేయించి పూలచాదర్ సమర్పింపజేశారు. ఈ సందర్భంగా సప్తగిరి మాట్లాడుతూ దర్గాలో ఆధ్యాత్మికత ఉట్టిపడుతోందన్నారు. మనసుకు ప్రశాంతత కలిగిందన్నారు. ఎప్పటినుంచో దర్గాను సందర్శించాలనే కోరిక ఇప్పుడు నెరవేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. తాను నటించిన పెళ్లికాని ప్రసాద్, గోల్డ్‌మెన్ తదితర సినిమాలు త్వరలో రానున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటుగా రాయచోటికి చెందిన సినీ నటుడు ఆసిఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ




చెన్నూరు శివాలపల్లెలో సీతారాముల కల్యాణం... హాజరైన ప్రజలు

చెన్నూరు, ఏప్రిల్ 13 : మండలంలోని శివాలపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారామ లక్ష్మణ సమేత హనుమత్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. నూతనంగా నిర్మించిన ఈ ఆలయంలో మూడురోజుల నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మూలవిరాట్ విగ్రహాల దాత, టీడీపీ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి అన్న ప్రసాద వితరణ చేశారు. అలాగే ఆలయంలో గణపతి, సుబ్రమణ్యం స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు.

అదే గ్రామానికి చెందిన చిన్నఓబయ్య ఉత్సవమూర్తులను అందించారు. ధ్వజస్తంభానికి సాయినాథశర్మ పంచలోహ తొడుగును అందించారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం నిర్వహించగా ప్రజలు ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు.

మద్యపాన నిషేధం పేరుతో జగన్‌రెడ్డి లక్ష కోట్లు లూటీ

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 13 :మద్యపాన నిషేధం పేరుతో జగన్‌రెడ్డి లక్షల కోట్లు లూటీ చేశారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో మండిపడ్డారు. కల్తీ మద్యంతో వేల మంది మహిళల మంగళసూత్రాలు తెంచారని ఆరోపించారు. మద్యపాన నిషేధంపై హామీ ఇచ్చిన జగన్‌రెడ్డి నేటికీ ఒక్క టిఅడక్షన్ సెంటరు కూడా ప్రారంభించలేదన్నారు. ఐదేళ్లలో మద్యం సేవించేవారి సంఖ్య పెరిగిందే కానీ తగ్గిన దాఖలాలులేవన్నారు. మద్యం మాఫియా ద్వారా జేగ్యాంగ్ లక్షల కోట్లను అప్పనంగా కొట్టేసిందని ఆరోపించారు. జగన్‌రెడ్డి అవినీతి చేయడం కోసం మద్యం అమ్మకాల్లో డిజిటల్ పేమెంట్లను నిషేధించారని తెలిపారు. జగన్ హయాంలో మద్యం బ్లాక్ మార్కెట్లో విచ్చలవిడిగా సరఫరాఅవుతుందని తెలిపారు. జగన్‌రెడ్డిసోదరుడు వైఎస్ అనిల్‌రెడ్డి మద్యం వ్యాపారంలో ఆరితేరిపోయాడని ఆయన రాష్ట్రంలో మద్యం తయారీ కంపెనీలను నియంత్రిస్తున్నారని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చక్రాయపేట, ఏప్రిల్ 13: చక్రాయపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రా మాలలో ఆదివారం ఉదయం 8:15గంటల నుంచి 11:30 వరకు వి ద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏఈఈ ప్రవీణ్‌కుమార్‌యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చక్రాయపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున ఈ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

'సీపీఐ అభ్యర్థిని గెలిపించండి'

కడప (సెవెన్‌రోడ్స్), ఏప్రిల్ 13: నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేసే సీపీఐ అభ్యర్థి గాలి చంద్రను కమలాపురం ఎమ్మెల్యేగా గెలిపించి చట్టసభలకు పంపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఓబులేసు పిలుపుని చ్చారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ అభివృద్ధిని పట్టించుకోకుండా వదిలేసిందన్నా రు. సీపీఐ కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటశివ, బషీరున్నీసా పాల్గొన్నారు.

నన్ను నమ్మినవారికి అండగా ఉంటాను : పుట్టా

మైదుకూరు రూరల్ (దువ్వూరు)ఏప్రిల్13 : తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కృషి చేసేవారికి,నన్ను నమ్మి పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్క నాయకునికి,కార్యకర్తకు అండగా ఉంటానని టీడీపీ మైదుకూరు అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. దువ్వూరు మండలంలోని గుడిపాడు గ్రామంలో శనివారం పార్టీ ప్రచారంలో భాగంగా అదే గ్రామానికి చెందిన తుమ్మల వీరమునిరెడ్డి కుమారులు వైసీపీ నాయకులు తుమ్మల పెద్ద కొండారెడ్డి,తుమ్మల శివవంకర్‌రెడ్డి, తుమ్మల నారాయణరెడ్డి,తుమ్మల వెంకటరెడ్డి వారి అనుచర వర్గం సుమారు 100కు పైగా కుటుంబాలు పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీ లో చేరాయి. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బోరెడ్డి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా విధులు నిర్వహించండి

● పీఓ, ఏపీఓలకు సూచన



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న పీఓ, ఏపీఓలు

పులివెందుల రూరల్, ఏప్రిల్ 13: సాధారణ ఎన్నికల నేపథ్యంలో నియమింపబడ్డ పీఓ, ఏపీఓలు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ట్రైనింగ్ ఆఫీసర్లు సూచించారు. శనివారం పులివెందుల డివిజన్ పరిధిలో పోలింగ్ స్టేషన్‌లలో ప్రి సైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌లకు స్థానిక మెయిన్ స్కూల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఆర్డీఓ వెంకటేశులు పరిశీలించారు. అక్కడి ట్రైనింగ్ అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్లు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ, విధానాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎన్నికల సామాగ్రి, ఈ వీఎం, వీవీప్యాట్, పేపర్ సీల్, ఎలక్టోరల్ రోల్ తదితర వాటి గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. పరిశీలకులు, డీఈఓ మరియు ఆర్‌ఓలు/ఏఆర్‌ఓలు పైఅధికారులచే తనిఖీలు ఉంటాయన్నారు. ఎన్నికల ముందు రోజు రాత్రి పోలింగ్ సిబ్బంది చేసుకోవాల్సిన ఏర్పాట్లను వివరించారు. పోలింగ్ ముందు రోజు, తర్వాత రోజు చేయాల్సిన విధివిధానాలపై శిక్షణ ఇచ్చారు. శనివారం మొదటి రోజు జరిగిన ఈ శిక్షణకు 415 మంది హాజరు కాగా, ఆదివారం రెండవ రోజు 407 మంది పీఓ, ఏపీఓలు శిక్షణ తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ, ఆర్‌అండ్‌బి తదితర శాఖల అధికారులు పీఓ, ఏపీఓలుగా శిక్షణ పొందారు.


ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య అకాడమీ సంచలనం



విద్యార్థులతో శ్రీచైతన్య అకాడమీ సిబ్బంది

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 13 : ఇంటర్ పరీక్ష ఫలితాల్లో శ్రీచైతన్య అకాడమీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి సంచలనం సృష్టించారని కరస్పాండెంట్ మల్లికార్జున్ తెలిపారు. సీ నియర్ బైపీసీలో నఫీసాఖానం 989 మార్కులతో స్టేట్ ర్యాంకు సాధించిందన్నారు. ఎంపీసీ విభాగంలో శిరీష 986 మార్కులతో కడప జిల్లా టాపర్‌గా నిలిచిందన్నారు. 90 శా తం ఉత్తీర్ణత సాధించి తమ కళాశాల జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నా రు. విద్యార్థులను డైరెక్టర్ రామచంద్రనాయుడు, ప్రిన్సిపాల్ రమేష్ అభినందించారు. విజయానికి కారకులైన తల్లిదండ్రులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా జయరామిరెడ్డి



వేంపల్లె, ఏప్రిల్ 13: టీడీపీ కడప జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా వేంపల్లెకు చెందిన సీనియర్ నాయకులు ఎస్‌బి జయరామిరెడ్డిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అధిష్ఠానం సూచన మేరకు ఆయన నియామకం చేపట్టారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని జయరామిరెడ్డి తెలిపారు. పదవి వచ్చేందుకు కారణమైన చంద్రబాబునాయుడు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి, పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవిలకు కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులకు అన్నదానం, దుస్తుల పంపిణీ



అనాథ వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న నంబూరు కుళాయప్ప కుటుంబ సభ్యులు

వేంపల్లె, ఏప్రిల్ 13: రాజీవ్‌నగర్ కాలనీలోని మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం, బట్టలు పంపిణీ చేశారు. శనివారం వేంపల్లె బలిజ సంఘం అధ్యక్షుడు నంబూరు కుళాయప్ప, పద్మావతిల కోడలు బిందు పుట్టిన రోజు సందర్భంగా అనాథ వృద్ధులకు అన్నదానం, స్వీట్లు అందించారు. అనంతరం వృద్ధులకు చీరలు, పంచెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు వెంకటలక్షుమ్మ, సాయికుమార్, శ్రీధర్, సుదర్శన్, మధుసూదన్, లక్ష్మి, భాగ్యలక్ష్మి, మన్విత, ఆశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ మంత్రం.. లక్ష పారాయణం



రామమంత్రాన్ని పారాయణం చేస్తున్న భక్తులు

చక్రాయపేట, ఏప్రిల్ 13: మండలంలోని నాగులగుట్టపల్లె-దేవరగుట్టపల్లె మధ్యలో వెలసిన శ్రీరాముని తల్లిదండ్రులైన కౌసల్య, సుమిత్ర, కైకేయి దశరథ మహారాజు దేవస్థానంలో శ్రీరామ తారక మంత్రం లక్ష పారాయణం జరిగిందని దశరథ మహారాజుస్వామి ట్రస్టు సభ్యులు తెలిపారు. గత మూడేళ్లుగా ప్రతి శనివారం అన్నప్రసాదం జరుగుతోందని తెలిపారు. శనివారం చక్రాయపేట ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తున్న నాగేంద్ర ఈ అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. భాగవత ఉత్తములు నారాయణరెడ్డి, ఓబయ్య రాజు, శివరామిరెడ్డి, రాఘవరెడ్డి, రాధమ్మ, లక్ష్మీదేవి, ఆలయ ధర్మకర్త రామసుబ్బయ్య పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో వేంపల్లె బాలికల హైస్కూల్ ఫలితాలు నిల్

వేంపల్లె, ఏప్రిల్ 13: రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రవేశపెట్టిన ప్లస్ టు పాఠశాలల్లో ఫలితాలు నిరాశాజనకంగా ఉన్నాయి. వేంపల్లెలోని బాలికల ఉన్నత పపాఠశాలలో ప్లస్ టు కళాశాల ఉంది. ఆ కళాశాలలో మొదటి సంవత్సరం ఫలితాలు నిల్‌గా నమోదయ్యాయి. మొదటి సంవత్సరం బైపీసీలో 16 మంది, సీఈసీలో 9 మంది ఉండగా అందరు ఫెయిల్ అయ్యారు. ద్వితీయ సంవత్సరంలో బైపీసీలో 14 మంది ఉండగా ఏడు మంది పాసయ్యారు. సీఈసీలో ఆరుగురు ఉండగా ఇద్దరు ఉత్తీర్ణత సాధించారు. తొమ్మిది మంది దాకా ఉపాధ్యాయులు ఉన్నారు. వీరందరు క్వాలిఫైడ్‌లే. అయిన సున్న ఫలితాలు రావడం పట్ల అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి భవిష్యత్తులో మంచి ఫలితాలు వచ్చేల ఉపాధ్యాయులు కృషిచేసేలా చర్య లు తీసుకుంటామని ఎంఈఓ జాఫర్ తెలిపారు.

టీడీపీ నుంచి బహిష్కరణ



బహిష్కరణ పత్రాన్ని చూపుతున్న సానపురెడ్డి శివకొండారెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 13 : టీడీపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు కడప నియోజకవర్గానికి చెందిన చిప్పగిరి మీనాక్షి, స్వర్ణలత, తాటగిరి నిర్మల, విజయలక్ష్మిలను టీడీపీ నుంచి బహిష్కరించినట్లు నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి తెలిపారు. కడప నగరం 26వ డివిజను మాసాపేట టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని టీడీపీ నుంచి బహిష్కరించామన్నారు. పార్టీ గురించి కానీ, పార్టీ నాయకుల గురించి కా నీ అనుచిత వ్యాఖ్యలు చేస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవ న్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సి.శంకర్, కళ్యాణ్ రాజ్, మా సా పేట శివ, ప్రణవతి, గొడుగునూరు రాజశేఖర్, కొమ్మలపాటి, ఇల్లూరు ఓబులేసు, ముద్దూరు రాముడు, జీవన్ పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే జైలు తప్పదు



మాట్లాడుతున్న సీఐ చిరంజీవి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 13 : ఎన్నికలకు సంబంధించి గ్రామాల్లో ఘర్షణ వాతావరణం సృష్టించినా, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా చర్యలు కఠినంగా ఉంటాయని సీఐ చిరంజీవి హెచ్చరించారు. శనివారం టేకూరుపేట గ్రామంలో పల్లెనిద్రలో భాగంగా గ్రామస్థులకు ఎలక్షన్ల గురించి జాగ్రత్త చర్యలు తెలిపారు. అలాగే శాంతికమిటి సమావేశం నిర్వహించారు. ఘర్షణలకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా శనివారం సాయంత్రం మండలంలోని రజాసాహెబ్‌పేట, తోకలపల్లె గ్రామంలో గ్రామ దర్శిని నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, ఏఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖాజీపేట..: రానున్న ఎన్నికల్లో గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడితే జైలుపాలు కాక తప్పదని సీఐ రామాంజులు అన్నారు. మండల పరిధిలోని త్రిపురవరం, ఏటూరు గ్రామాల్లో పల్లెదర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు పోలింగ్ కేంద్రాలకు నిర్భయంగా వెళ్లి ఓటు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును నిర్భయంగా ఉపయోగించుకోవాలి

కొండాపురం, ఏప్రిల్ 13: ఓటు హక్కును నిర్భయంగా ఉపయోగించు కోవాలని కడప కళాజాత బృందం సభ్యులు వివరించారు. మండలంలోని టి.కోడూరు గ్రామంలో శనివారం రాత్రి కనువిప్పు నాటకం ద్వారా వారు ఓటు హక్కు గురించి ప్రజలకు వివరించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొండాపురం ఎస్‌ఐ యోగీంద్ర,సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టా సమక్షంలో మాజీ జడ్పీటీసీ చేరిక

ఖాజీపేట, ఏప్రిల్ 13: మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ స్వగృహంలో శనివారం ఖాజీపేట మాజీ జడ్పీటీసీ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో మెజార్టీ తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలకొండారెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, బిజిలి పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం



బీజేపీ కార్యాలయం ప్రారంభిస్తున్న దృశ్యం

బద్వేలు, ఏప్రిల్ 13 : బద్వేలు పట్టణంలో శనివారం బీజేపీ కార్యాలయాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంగళ శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ కడప పార్లమెంటు కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బద్వేలులో బీజేపీ గెలుపు ఖాయమన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి రోశన్న, జనసేన సమన్వయకర్త రమేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్టి శ్రీనివాసులు, వెంకటసుబ్బారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు స్వస్తి పలుకుదాం

ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి

రాజుపాలెం, ఏప్రిల్ 13 : రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని ఆ పార్టీకి స్వస్తి పలికేందుకు సమయం ఆసన్నమైందని ప్రొద్దుటూరు టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. శనివారం తొండలదిన్నె గ్రామంలో బీసీ జయహో సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీలకు టీడీపీ లోనే న్యాయం జరిగిందని, చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఎక్కువ ప్రాధాన్యత బీసీలకే జరిగిందన్నారు. వెయ్యి కోట్లకు పడగలెత్తిన రాచమల్లు ప్రసాద్‌రెడ్డిని ఇక ఇంటికి సాగనంపాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను, ఎంపీ అభ్యర్థిగా భూపేశ్‌రెడ్డి పోటీ చేస్తున్నారని సైకిలు గుర్తుకు ఓటు వేయాలని ఆయన సూచించారు. ఈ



మాట్లాడుతున్న నంద్యాల వరదరాజులరెడ్డి

కార్యక్రమంలో బీసీ నాయకులు రాజగోపాల్‌యాదవ్, బొర్ర శ్రీనివా సులు, నంద్యాల కొండారెడ్డి, చెమికల పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం..: తొండల దిన్నె గ్రామంలో సైకిలు గుర్తుకు ఓటు వేయాలని ప్రొద్దుటూరు వరదరాజులరెడ్డి ఓటర్లను కోరారు. కొండారెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకూ వెళ్లి తన తండ్రి అయిన వరదరాజులరెడ్డికి సైకిలు గుర్తుకు ఓటు వేయాలని అదే విధంగా భూపేశ్‌కు సైకిలు గుర్తుపై ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ నాయకులు చెమికల పురుషోత్తంరెడ్డి, తోట మహేశ్వర్‌రెడ్డి, చదిపిరాళ్ల వేణుగోపాల్ రెడ్డి, నాగయ్యనాయుడు, బూతూరు వెంకటరామిరెడ్డి, బత్తల పుల్లయ్య, గౌస్, ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, కుమ్మరపల్లె వెంకట్రామిరెడ్డి, మానికింది ఖాదర్‌బాషా, తాటి శ్రీనివాసులు నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

అట్లూరు, ఏప్రిల్ 13 : అట్లూరు మండలం తంబళ్లగొంది ఎస్సీకాలనీ లో శనివారం బద్వేలు కాంగ్రెస్ అభ్యర్థి విజయజ్యోతి ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్‌లోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఆమె కరపత్రాలు పంచుతూ వివరించారు. మండల కాంగ్రెస్ నాయకుడు మునెయ్య ఆధ్వర్యంలో 20 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

గోపవరం, ఏప్రిల్ 13 : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం గర్భవతులకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. వైద్యాధికారులు మహేశ్వర్‌రెడ్డి, మురళీక్రిష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లోభాగంగా వైద్యపరీక్షలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ఎస్‌ఎండీ గౌస్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా టీడీపీ నాయకుల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

అట్లూరు, ఏప్రిల్ 13 : అట్లూరు మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో ఎన్డీఏ కూటమి నాయకులు మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, కడప టీడీపీ పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు సుధారాణి ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. బద్వేలు బీజేపీ అభ్యర్థి రోశన్న కమలంగుర్తుకు, కడప పార్లమెంటు అభ్యర్థి భూపేశ్‌రెడ్డికి సైకిలుపై ఓటు వేయాలంటూ కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు ఆంజనేయులు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, జయక్రిష్ణారెడ్డి, చిలిపి క్రిష్ణారెడ్డి, పెదరాంసుబ్బారెడ్డి, చిన్న రామసుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నరసారెడ్డి, కోటపాటి పెంచలయ్య, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థిని గెలిపించండి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు

బి.కోడూరు, ఏప్రిల్ 13 : బి.కోడూరు మండలంలో కూటమి అభ్యర్థులు మొదటగా శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి హాజరై దంతెలపల్లె గ్రామంలో రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు రమణారెడ్డి, మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, అమర్‌నాధరెడ్డి, గోడి రమణారెడ్డి ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్నకు కమలం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడుఉట్టిశ్రీనివాసులు, వెంకటసుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, బాలిరెడ్డి, నవీన్, క్రిష్ణయ్య, చెన్నక్రిష్ణారెడ్డి, మద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

బద్వేలు రూరల్, ఏప్రిల్ 13 : మండల పరిధిలోని వల్లెరవారిపల్లెలో వెలసిన శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో చైత్ర మాసం మొదటి శనివారం పురస్కరించుకుని స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ప్రజలు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా రాములోరి విగ్రహ ప్రతిష్ఠ

బి.కోడూరు, ఏప్రిల్ 13 : మండల పరిధిలోని తుమ్మలపల్లె గ్రామంలో కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, మండల టీడీపీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి, గోడి రమణారెడ్డి, అమర్‌నాధరెడ్డి, ఓ.రమణారెడ్డి, జయరామిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, తంగేడుపల్లె సర్పంచ్ లక్ష్మీదేవి, పి.సుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ నాయకులు ముస్లింల అభివృద్ధికి పాటుపడాలి



మాజీ ఎమ్మెల్యే విజయమ్మతో సమావేశమైన మైనార్టీ నాయకులు

బద్వేలు టౌన్, ఏప్రిల్ 13 : మైనార్టీ నాయకులు ముస్లింల అభివృద్ధికి పాటుపడాలని ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు షేక్ మహబూబ్‌బాషా, తెలుగు యువత పార్లమెంటు ఉపాధ్యక్షుడు జహంగీర్‌బాషా అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ముస్లిం మైనార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనార్టీ నాయకులు ముస్లింల అభివృద్ధికి పాటుపడాలని మత పరమైన విషయాలకు రాజకీయాలతో ముడి పెట్టవద్దని వారన్నారు. మైనార్టీలంతా టీడీపీ వైపు ఉన్నారని, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు హుసేన్‌పీరా, షరీఫ్, నగర మైనార్టీ అధ్యక్షుడు బాషారసూల్, ముస్తఫా, మహబూబ్‌బాషా, షరీఫ్, సిరాజ్, కాటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా : రోశన్న



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్న

పోరుమామిళ్ల, ఏప్రిల్ 13 : ఒక్క అవకాశం ఇవ్వండి, అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్న అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రంగ సముద్రం పంచాయతీలోని మహబూబ్‌నగర్ 81 పోలింగ్ బూత్ పరిధిలోని ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.కాగా బొజ్జ రోశనన్న గెలిపించాలని ఆయన తనయుడు రోశన్‌కార్తీక్ శనివారం పలు గ్రామాల్లో ప్రచారం చేశారు.

కాశినాయన..: కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలు(డబుల్ ఇంజన్ సర్కారులు) అధికారంలోకి వస్తే రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని బద్వేల్ ఎన్డీఏ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జారోశన్న పేర్కొన్నారు. శనివారం టీడీపీ,జనసేన,బీజేపీ నాయకులతో కలిసి అంబవరం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, మాజీసర్పంచ్ ఖాజాపీరా,అంబవరం షరీఫ్, ఇమామహుస్సేన్, హోండా రవీంద్రారెడ్డి రోహిత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లేట్‌మిషన్ షరీఫ్, అబ్బర్వర్ శివశంకర్, గురయ్యఎల్.శ్రీనివాసులరెడ్డి, అడవిరాముడు, పి.పోలిరెడ్డి, వేమిరెడ్డి సిద్దారెడ్డి, నాగార్జున్‌రెడ్డి,ఎంపీటీసీ పీరయ్యమదు,అబ్దుల్‌రహీం ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరామ మంత్రం.. లక్ష పారాయణం



రామమంత్రాన్ని పారాయణం చేస్తున్న భక్తులు

చక్రాయపేట, ఏప్రిల్ 13: మండలంలోని నాగులగుట్టపల్లె-దేవరగుట్టపల్లె మధ్యలో వెలసిన శ్రీరాముని తల్లిదండ్రులైన కౌసల్య, సుమిత్ర, కైకేయి దశరథ మహారాజు దేవస్థా నంలో శ్రీరామ తారక మంత్రం లక్ష పారాయ ణం జరిగిందని దశరజ థ మహారాజుస్వామి ట్రస్టు సభ్యులు తెలిపారు. గత మూడేళ్లుగా ప్రతి శనివారం అన్నప్రసాదం జరుగుతోందని తెలిపారు. శనివారం చక్రాయపేట ఎంపీడీఓ కార్యాలయంలో పని చేస్తున్న నాగేంద్ర ఈ అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. భాగవత ఉత్తములు నారాయణరెడ్డి, ఓబయ్య రాజు, శివరామిరెడ్డి, రాఘవరెడ్డి, రాధమ్మ, లక్ష్మిదేవి, ఆలయ ధర్మకర్త రామసుబ్బయ్య పాల్గొన్నారు.

115 కుటుంబాలు టీడీపీలో చేరిక



భూపేశ్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన దృశ్యం

కొండాపురం, ఏప్రిల్ 13: మండలంలోని తాళ్లప్రొద్దుటూరు,నేదరపేట గ్రామాలలో శుక్రవారం రాత్రి సుమారు 100 కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీ కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి సమక్షంలో వారు కండువాలు కప్పుకున్నారు. రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి,కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి ల గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన రాష్ట్ర మాజీ నెడ్‌క్యాప్ డైరెక్టర్ మిట్టా రామాంజులరెడ్డి, కాంట్రాక్టర్ మిట్టా భాస్కర్‌రెడ్డి లతో కలిపి సుమారు 100 కుటుంబాలు టీడీపీ లో చేరారు.అదేవిధంగా నేదరపేట గ్రామానికి చెందిన సంజీవరెడ్డి, మల్లారెడ్డి ,యల్లారెడ్డి, బాలిరెడ్డి,ప్రతాప్‌రెడ్డి తదితర 15 కుటుంబాలు టీడీపీ లో చేరాయి.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, గండ్లూరు నాగేశ్వరరెడ్డి, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం



30 వవార్డు ప్రచారంలో పాల్గొన్న వరద కుమార్తెలు, కోడలు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 13 : ప్రొద్దుటూరు అభివృద్ధి పెద్దాయన నంద్యాల వరదరాజులరెడ్డి తోనే సాధ్యమని వరదరాజులరెడ్డి కుమార్తెలు అనురాధ, అరుణమ్మ కోడలు మీనా తెలిపారు. శనివారం 30 వవార్డులోని వరలక్ష్మీ అపార్టు మెంటు, నాగేం ద్ర నగర్‌లలో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల చమేలి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగా కల్యాణి, టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు బోగాల లక్ష్మీనారాయణమ్మ, నంద్యాల లక్ష్మీ ,నంద్యాల శిల్ప, కోటా శ్రీదేవి, శైలజ, లక్ష్మీ, అంజనమ్మ, అలివేలు, భారతి, హసీనా, మార్తల గురివిరెడ్డి, చీమల రాజశేఖర్‌రెడ్డి, జయరామ్ క్రిష్ణారెడ్డి, నాగేంద్ర,తలారి రమేష్ మార్తల రఘు తదితరులు పాల్గొన్నారు.

నన్ను నమ్మినవారికి అండగా ఉంటాను : పుట్టా



పుట్టా సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన తుమ్మల పెద్ద కొండారెడ్డి బ్రదర్స్

మైదుకూరు రూరల్ (దువ్వూరు)ఏప్రిల్13 : తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కృషి చేసేవారికి,నన్ను నమ్మి పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్క నాయకునికి,కార్యకర్తకు అండగా ఉంటానని టీడీపీ మైదుకూరు అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. దువ్వూరు మండలంలోని గుడిపాడు గ్రామంలో శనివారం పార్టీ ప్రచారంలో భాగంగా అదే గ్రామానికి చెందిన తుమ్మల వీరమునిరెడ్డి కుమారులు వైసీపీ నాయకులు తుమ్మల పెద్ద కొండారెడ్డి,తుమ్మల శివవంకర్‌రెడ్డి, తుమ్మల నారాయణరెడ్డి,తుమ్మల వెంకటరెడ్డి వారి అనుచర వర్గం సుమారు 100కు పైగా కుటుంబాలు పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీ లో చేరాయి. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు బోరెడ్డి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా టీడీపీ నాయకుల ప్రచారం



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ముస్లిం నాయకులు

ఖాజీపేట, ఏప్రిల్ 13: స్వచ్ఛందంగా కార్యకర్తలు ఇంటింటి ప్రచారంలో పాల్గొని చంద్రబాబు ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తున్నారని టీడీపీ ఉపమండలాధ్యక్షుడు జిలానీ అన్నారు. శనివారం పుల్లూరు పంచాయతీలోని సర్వర్‌ఖాన్‌పేట, కొత్తపత్తూరు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో పుట్టా సుధాకర్‌యాదవ్ గెలుపుకోసం ఓటు వేసేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఫరూక్, జెండాల మాబాష, షమీ, డాక్టర్ ఆసీఫ్, కమలాపురం గౌస్, పూల సుల్తాన్, నూర్, ప్రతాప్‌రెడ్డి, నంద్యాల సుబ్బయ్య, ప్రసాద్‌రెడ్డి, కాశింపీరా, తదితరులు పాల్గొన్నారు.

'మద్య నిషేధం హామీని వ్యాపారంగా మార్చిన జగన్'

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 13 : ఎన్నికల ముందు మద్యనిషేధాన్ని అంచెలంచెలుగా అమలు చేస్తామని చెప్పి ఆ హామీని నేడు వేల కోట్ల వ్యాపారంగా మలుచుకున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి ఆరోపించారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం నిర్వహించే వేల కోట్ల మద్యం వ్యాపారానికి అకౌంట్‌బులిటీ లేదన్నారు. మద్యం వ్యాపారంలో వేల, లక్షల కోట్ల దోపిడీ చేయవచ్చని జగన్ మద్యం వ్యాపారాన్ని ఏకంగా ప్రభుత్వ రంగంలో నిర్వహిస్తున్నాడన్నారు. అందుకే మద్య నిషేధం పేరుచెప్పి ఏకంగా మద్యం రేట్లు భారీ గా పెంచాడన్నారు. కాగావలంటీర్లు ప్రభుత్వ సేవకులుగా వుండాలని వైసీపీ ప్రచారకర్తలు గా పనిచేయవద్దని కొండారెడ్డి హితవుపలికారు. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్లకు 5 వేలనుంచి 10 వేల జీతం పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు నంద్యాల కొండారెడ్డి

48 ఏళ్ల పురుషుడికి 38ఏళ్ల యువతి గుండె

శ్రీ పద్మావతి హృదయాలయలో 14వ గుండె మార్పిడి ఆపరేషన్

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 13: తాను చనిపోతూ మరో ముగ్గురి ప్రాణాలను కాపాడింది ఓ యువతి. ప్రొద్దుటూరుకు చెందిన కృష్ణవేణి (38)కి ప్రమాదవశాత్తు తలకు బలమైన గాయం తగలడంతో కర్నూలు కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు.పరీక్షించిన వైద్యులు ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్టు నిర్ధారించారు. అవయవ దానం చేయాలని వైద్యులు అభ్యర్థించగా ఆమె కుటుంబ సభ్యులు అంగీకరించారు.ఆమె కిడ్నీని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి, గుండెను, లివర్‌ను తిరుపతికి తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. తిరుపతికి హెలికాప్టర్‌లో తరలించిన గుండె, లివర్‌ను గ్రీన్ ఛానల్ ద్వారా ఆస్పత్రులకు చేర్చారు. మధ్యాహ్నం 12.30 గంటలకు గుండె శ్రీ పద్మావతి హృదయాలయానికి, లివర్ స్విమ్స్ ఆస్పత్రికి చేరుకు న్నాయి.హృదయాలయ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏలూరు జిల్లాకు చెందిన బాబూరావు (48)కు ఆ గుండెను వైద్యులు సుమారు 7 గంటలపాటు శ్రమించి అమర్చారు.దీంతో హృదయాలయ ఆస్పత్రిలో వరుసగా 14వ గుండె మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా ముగిసినట్టైంది.స్విమ్స్‌కు చేర్చిన లివర్‌ను త్వరలో అవసరమైన పేషెంటుకు అమర్చనున్నారు.



కర్నూలు నుంచి తీసుకొచ్చిన గుండెను శ్రీ పద్మావతి హృదయాలయలోకి తీసుకు వెళుతున్న వైద్యులు

వరద గెలుపునకు కృషి చేస్తా

టీడీపీ మండల కన్వీనరు ధనిరెడ్డి విశ్వనాధరెడ్డి



రాజుపాలెం, ఏప్రిల్ 13 :ప్రొద్దుటూరు టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి గెలుపునకు కృషి చేస్తానని రాజుపాలెం మండల టీడీపీ కన్వీనరు ధనిరెడ్డి విశ్వనాధరెడ్డి తెలిపారు. వరదరాజులరెడ్డి, కొండారెడ్డి శనివారం సాయంత్రం విశ్వనాధరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వరద మాట్లాడుతూ విశ్వనాధరెడ్డికి ఎల్లవేళలా తన సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుత్తి దస్తగిరి, సర్పంచ్ నరసమ్మ, గోన పెద్దిరెడ్డి, కాసా బాబురెడ్డి, కిరణ్‌రెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, పాలాంజనేయరెడ్డి, వెంకటరెడ్డి, ఎం.సుబ్బయ్య, ఎ.గోపాల్, ఆలమూరు సుభాన్‌బాషా, గైబూసా, మాజీ సర్పంచ్ అహరోన్, సామ్యూల్, చిన్న నరసింహులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.